ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
1
వరంగల్
ఉమ్మడి జిల్లా
గురువారం 2 అక్టోబరు 2025

దసరా వచ్చిందయ్యా...

- ఇంటింటా విందు వినోదాల సందడి
- ఆలయాల్లో శమీ పూజలు
- పలుచోట్ల రావణవధకు ఏర్పాట్లు పూర్తి
- పల్లెపట్నాల్లో పండుగ కోలాహలం



హనుమకొండ కల్చరల్ / వరంగల్ కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతీ యేటా ఆశ్వయుజ మాసం శుక్లపక్షంలో దశమి తిథితో జరుపుకునే అతి పెద్ద హిందువుల పర్వం దసరా పండగను గురువారం జరుపుకునేందుకు ప్రజాలంతా సన్నద్ధమయ్యారు. పాండ్యమి మొదలుకొని అష్టమి వరకున్న పది రోజులు వైభవంగా శరన్నవరాత్రులు జరుపుకుని వివిధ అలంకారాల్లో అమ్మవారిని పూజించి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ అన్నట్లుగా చెడుపై మంచి సాధించిన విజయానికి నాందిగా దసరా పేరిట విజయదశమి పర్వాన్ని వైభవంగా జరుపుకోవడం ప్రతీ యేటా ఆనవాయితీగా వస్తోంది. పర్వదిన వేళ పొద్దున్నే లేచి తలంటు పోసుకొని నూతన వస్త్రాలను ధరించి ఇష్టదైవాలను పూజించిన అనంతరం పిండి వంటలు చేసుకొని మందు, విందుతో ఇంటిల్లిపాది ఉల్లాసంగా గడపడమే ఈ పర్వదిన ప్రత్యేకం. దీనికితోడు సాయంత్రం వేళ ఆలయాలను సందర్శించి జమ్మి చెట్టుకు

మిగతా 2వ పేజీలో...

మహిషాసుర మర్దినిగా భద్రకాళి

అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

భక్తులతో కిటకిటలాడిన దేవాలయం



మహిషాసుర మర్దిని అలంకరణలో భద్రకాళి అమ్మవారు

2

మహిషాసుర మర్దినిగా భద్రకాళి



అమ్మవారి సన్నిధిలో పూర్ణాహుతిలో పాల్గొన్న హైకోర్టు జడ్జి నందికొండ నర్సింగరావు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవం గా కొనసాగుతున్నాయి. బుధవారం రోజున అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 4 గంటల కు నిత్య పూజల అనంతరం మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించి పూజ లు చేశారు. అనంతరం శరభ వాహనంపై, సాయంత్రం పుష్పరథంపై ఉత్సవమూర్తిని ఊరేగించారు. ఈ సందర్భంగా యాగశాలలో జరిగిన ప్రత్యేక హోమంలో హైకోర్టు జడ్జి నంది కొండ నర్సింగరావు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు పాల్గొని హోమం అనంతరం మహా పూర్ణాహుతి నిర్వహించారు. వారితో పాటు హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ దర్శించుకున్నారు. బుధవారం అమ్మవారి దేవాలయానికి వీఐపీల తాకిడి పెరిగింది. పక్క జిల్లాలనుంచి అధికారులు అమ్మవారి దర్శనానికి తరలి వచ్చి దర్శించుకున్నారు.

ప్రత్యేక రోప్ పార్టీ ఏర్పాటు చేయాలి..

విజయదశమి, దసరా పండుగ సందర్భంగా గురువారం వేలాది మంది భక్తులు రానున్న నేపథ్యంలో పైరవీలకు తావీయకుండా సామాన్య భక్తులకు ధర్మ దర్శనానికి ప్రాధాన్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు. సిబ్బంది సేవ అంటూ యువకులు గర్భాలయంలో ఉండి నెట్టి వేయడం లాంటి సంఘటనలతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్యూలైన్ల ద్వారా భక్తులు దర్శించుకునే విధంగా ప్రత్యేక రోప్ పార్టీ ఏర్పాటు చేయాలని, వీఐపీ లైన్లు, వికలాంగుల లైన్లు, మీడియా లైన్, భక్తుల ధర్మదర్శనం, ప్రత్యేక టికెట్ దర్శనం లైన్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

భక్తుల కిటకిట

బుధవారం వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనార్థం తరలి వచ్చారు. ప్రత్యేక క్యూలైన్ల ద్వారా ధర్మదర్శనంతో పాటు ప్రత్యేక దర్శనం టికెట్లతో దర్శించుకున్నారు. వీఐపీల తాకిడి పెరగడంతో ముందు గేటు నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో ఆలయంలో రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా కొందరు ప్రైవేటు అర్చకులు ముందు ద్వారం గుండా భక్తులను తీసుకెళ్లడంతో క్యూలైన్లలో వేచి యున్న భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

దసరా వచ్చిందయ్యా..

(1వ పేజీ తరువాయి)

పూజ చేయడం, పాలపిట్టను దర్శించుకోవడం ఈ పర్వదిన వేళ విశిష్టమైందని శాస్త్రాలు చెప్పిన క్రమంలో ప్రజలంతా వీటిని ఆచరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఈ పర్వదిన జోరు హోరు స్పష్టంగా కనపడుతుంది. ఈ సారి దసరా పర్వం గురువారంతోపాటు జాతిపిత మహాత్మా గాంధీ అయిన అక్టోబరు 2 కలిసి రావడంతో గురువారం రోజు మటన్ షాపులు దసరా వేళ మద్యపాన ప్రియులకు ఇష్టమైన వైన్ షాపులకు కూడా సెలవు కావడంతో ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ క్రమంలో బుధవారమే నగరంలోపాటు గ్రామీణ ప్రాంతాల్లో మద్యం షాపులు కిటకిటలాడాయి. గురువారం ఉదయం తెల్లవారుజాము 4 గంటలలోపే మటన్ అందించనున్నట్లు హనుమకొండ మటన్ మర్చంట్ అసోసియేషన్ వినియోగదారులకు ప్రకటన చేయడం గమనార్హం.

విజయదశమి వేళ

మహాభారత ఇతిహాసమున పాండవులు అజ్ఞాత సమయంలో విరాట్‌నగర పొలిమేరల్లో ఉన్న శమివృక్షం (జమ్మిచెట్టు)పై ఆయుధాలను భద్రపరిచారని, ఉత్తర గోగ్రహణ వేళ అర్జునుడు ఆ ధనుర్భానాలను తీసుకొని కౌరవులపై పోరాడి గోవులను తిరిగి సంగ్రహించి విజయం పొందారని అందుకే విజయోత్సహంగా దసరా జరుపుకుంటున్నామన్నది ఒక ప్రతితీ. దీంతోపాటు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న దశకంఠుడైన రావణసూరిని మహిషాసుర మర్ధిని రూపంలో ఉన్న అమ్మవారు సంహరించిన వేళ చెడుపై మంచి సాధించిన గుర్తుగా దుష్టుని పీడ విరగడైందంటూ ఆనందంగా జరుపుకునే పర్వమే ఈ విజయదశమి అన్న నానుడి కూడా ప్రజల్లో ఉంది.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
గురువారం 2 అక్టోబరు 2025

నేడు మాంసం షాపులు తెరవొద్దు.. 5
జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

ఒకరోజు ముందే కొనేశారు..

- మద్యం, మాంసం ప్రియుల ముందు జాగ్రత్త
- షాపుల ముందు జనం బారులు
- దసరా, గాంధీ జయంతి ఒకే రోజు వచ్చిన ఫలితం

హనుమకొండ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది అక్టోబర్ 2న దసరా పండుగ, గాంధీ జయంతి ఒకే రోజు రావడంతో మద్యం, మాంసం ప్రియులు ఇబ్బందుల్లో పడ్డారు. సాధారణంగా గాంధీ జయంతి రోజున మద్యం, మాంసం దుకాణాలను మూసివేయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే దసరా పండుగ కూడా అదే రోజు రావడంతో నిషేధం మందుబాబులకు, మటన్ ప్రియులకు అశనిపాతంలా తగిలింది. దసరా అంటే చుక్క, ముక్క ఉండాల్సిందే. ఈ రెండు లేకపోతే దసరాయే లేదు. కానీ ఈసారి పెద్ద చిక్కొచ్చి పడింది. దసరా, గాంధీ జయంతి ఒకే రోజు రావడం చాలా అరుదుగా జరుగుతుంది. ఈ విచిత్ర పరిస్థితి ఉండడంతో మందుబాబులు, మాంసం ప్రియులు ఒకరోజు ముందే మేల్కొన్నారు. ముందే మద్యం, మాంసం కొనుగోలు చేయడానికి దుకాణాల ముందు పెద్ద ఎత్తున క్యూకట్టారు. అర్ధరాత్రి 12 గంటలు దాటితే నిషేధం అమలులోకి వస్తుందన్న కారణంతో కావలసిన మద్యాన్ని ఎగబడి కొన్నారు. మాంసం విక్రయదారులు కూడా ఒక రోజు ముందే పెద్దఎత్తున మాంసం విక్రయాలను సాగించారు. నగరంలో ఏ మద్యం షాపు ముందు చూసినా క్యూ కనిపించింది. మాంసం దుకాణాలు కూడా కిటకిటలాడాయి.


హనుమకొండలోని ఓ లిక్కర్ మార్ట్‌లో మద్యం ప్రియుల రద్దీ

పెరిగిన ధరలు

దసరా పండుగను పురస్కరించుకొని మాంసం ధరలు అమాంతం పెరిగాయి. సాధారణంగా మామూలు రోజుల్లో కిలో మటన్ రూ.900కు అమ్మకమయ్యేది. బుధవారం కిలో రూ.1000, డిమాండ్‌ను బట్టి అంతకన్నా ఎక్కువ ధరకు దుకాణదారులు విక్రయిస్తున్నారు. గాంధీ జయంతివల్ల దసరా రోజు అది కూడా దొరికే పరిస్థితి లేకపోవడంతో మాంసం ప్రియులు ఎంత ధరైనా పెట్టి కొనుగోలు చేస్తున్నారు. మేకలు, గొర్రెల ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. సాధారణ రోజుల్లో వీటి ధరలు సైజ్, బరువును బట్టి రూ.7వేల నుంచి రూ.9వేల మధ్య ఉండేది. కానీ దసరా రోజు ఫ్యాక్టరీలు, వ్యాపార సంస్థలు, అపార్టుమెంట్లు, ఇళ్ల ముందు జంతుబలులు ఇవ్వడం సర్వసాధారణం. దీనితో వీటికి విపరీతమైన డిమాండ్ పెరిగింది. రెండు, మూడు రోజుల ముందే గొర్రెలు, మేకల అమ్మకందారులకు అడ్వాన్సు ఇచ్చి మరీ బుక్ చేసుకున్నారు. ఆలస్యం అయితే అవి దొరికే పరిస్థితి లేదు. డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని వ్యాపారులు వీటి ధరలను అమాంతం పెంచేశారు. మద్యం ధరలు కూడా పెరిగాయి. పేరున్న బ్రాండ్ల మద్యం బాటిళ్లపై రూ.20 నుంచి రూ.40 పెంచి విక్రయిస్తున్నారు. దసరా జోష్‌లో కొనుగోలుదారులు కూడా ఇదేం పట్టించుకోకుండా కొనుగోలు చేస్తున్నారు.


వివరాలు వెల్లడిస్తున్న వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్

అధిక డబ్బుల ఆశచూపి మోసం

- చైన్ సిస్టమ్ పేరిట దగా చేస్తున్న ముఠా అరెస్టు
- నగదుతోపాటు, బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్

5

నేడు భద్రకాళి మహాదర్శనం

- చక్రస్నానం, అమ్మవారికి పట్టాభిషేకం
- సాయంత్రం జల క్రీడోత్సవం
- దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు, వసతుల ఏర్పాటు

5



ఆంధ్రజ్యోతి
WWW.ANDHRAJYOTHY.COM
హనుమకొండ సిటీ
HANUMAKONDA CITY ■ గురువారం 2 అక్టోబరు 2025

ఉద్యోగులు రక్తదానం

బాలసముద్రం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా ఆ సంస్థ ఉద్యోగులు అలాగే జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా ఈపీఎఫ్ ఉద్యోగుల భవిష్యనిధి విభాగం ఉద్యోగులు బుధవారం సంయుక్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఈవీ శ్రీనివాసరావు పాల్గొని రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేసి రక్తదానం చేసిన ఉద్యోగులను అభినందించారు. కార్యక్రమంలో ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ వైడీ శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ శివకేష్‌మీనా, బీఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం. కిషన్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతలకు సర్టిఫికెట్‌ను ఇస్తున్న ఈవీ శ్రీనివాసరావు

జయ జయహే మహిషాసురమర్దిని

- 10వ రోజుకు చేరిన శరన్నవరాత్రి వేడుకలు
- రుద్రేశ్వరాలయంలో మహా పూర్ణాహుతి
- వేడుకల్లో పాల్గొన్న బండా ప్రకాశ్



వేయిస్తంభాల ఆలయం వద్ద హోమం చేస్తున్న బండా ప్రకాశ్ తదితరులు



రెడ్డికాలనీలో అమ్మవారి పూజలో పాల్గొన్న మహిళలు

హనుమకొండ కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి వేడుకల పర్వం బుధవారం 10వ రోజుకు చేరుకుంది. నగరంలోని అనేక ప్రాంతాల్లో ప్రత్యేక మండపాల్లో అమ్మవారిని ప్రతిష్ఠింపజేసి వైభవంగా పూజలు నిర్వహిస్తున్నారు. రోజుకొక అలంకరణతో అమ్మవారిని కొలుస్తూ పూజాదికాలు నిర్వహిస్తున్నారు. చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్న వేడుకల పర్వంలో బుధవారం అమ్మవారిని నిత్య విధులు నిర్వహింపజేసిన అనంతరం రుద్రేశ్వరి అమ్మవారిని దశమ తిథికి అనుగుణంగా మహిసాసురమర్దినిగా అలంకరింపజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. బెల్లం అన్నం, పులిహోర నివేదన కావించి ఎర్రని అక్షింతలతో అమ్మవారిని పూజించారు. మహాయాగశాలలో గణపతి నవగ్రహ సుదర్శన మహాచండి హోమాన్ని 21 రకాల ఫలపుష్పాలతో వేద పండితుల మూల మంత్రయుక్తంగా మహా పూర్ణాహుతిని నిర్వహించారు. శాసనమండలి వైస్ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ మహాపూర్ణాహుతిలో పాల్గొన్నారు. నిత్య అన్న ప్రసాద నివేదన నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జస్టిస్ కందికొండ నర్సింహారావు దంపతులు, కేంద్ర పురావస్తు శాఖ తెలంగాణ రాష్ట్ర సూపరింటెండెంట్ నిఖిల్‌దాస్ దంపతులు కూడా బుధవారంనాటి పూజా కార్యక్రమాలు, హోమ పూర్ణాహుతిలో పాల్గొన్నారు. ప్రముఖ వేద పండితులు గుడిమల్ల విజయ్‌కుమారాచార్యులు, సంగీత్ శర్మలు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు.

సాయంత్రం సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో భాగంగా స్టేషన్ ఘనపూర్‌కు చెందిన తిరునగరి శ్రవణ్ కుమార్, ఇ.చంద్రశేఖర్, పరమేశ్వరి బృందంచే ప్రత్యేక సంగీత విభావరి నిర్వహించారు. ఆలయ ఈవో అనిల్‌కుమార్ పర్యవేక్షించారు. నగరంలోని లష్కర్ బజార్ రామమందిర్, మర్కజీ పాఠశాల సమీపంలో మార్వాడీ సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలతోపాటు రెడ్డికాలనీ, గుడిబండల్, రెవెన్యూ కాలనీలో ఏర్పాటు చేసిన శరన్నవరాత్రి వేడుకల్లో బుధవారం అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలంకరింపజేసి పూజాధికాలు నిర్వహించారు. రెడ్డికాలనీలో ప్రాంతంలో ఈసారి ఏర్పాటు చేసిన భారీ సైజ్ అమ్మవారిని ప్రజలు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. మహిళలు తరలివచ్చి అమ్మవారికి మంగళహారతులతో నీరాజనాలు అర్పించారు.

వైభవంగా కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు



విష్ణుపురి కాలనీలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు తదితరులు

వడ్డెపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వివిధ డివిజన్లలో ఏర్పాటు చేసిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. మండపాలు భక్తుల భజన కీర్తనలతో దుర్గామాత నామస్మరణ మార్మోగింది. దుర్గామాత బుధవారం సిద్ధిధాత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. హనుమకొండ 56వ డివిజన్ విష్ణుపురి కాలనీలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొంకా హరిబాబు- స్రవంతి దంపతులు ఏర్పాటు చేసిన దుర్గామాతను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ.. దేవి శరన్నవరాత్రులు సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కొంకా హరిబాబు, కాంగ్రెస్ శ్రేణులు కేఆర్. కృష్ణమూర్తి, చింత రమేష్ గౌడ్, వీసం సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్, కమిషనర్‌తో కలిసి వెల్‌నెస్ సెంటర్ కోసం భవనాలను పరిశీలిస్తున్న ఎంపీ కడియం కావ్య

వెల్‌నెస్ సెంటర్ కోసం స్థల పరిశీలన

హనుమకొండ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ కోసం బుధవారం ఎంపీ డాక్టర్ కడియం కావ్య, కలెక్టర్ స్నేహ శబరీష్, బల్దియా కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ నగరంలోని కొన్ని ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. హనుమకొండలోని కుడా కార్యాలయం, కాజీపేట డివిజన్ మున్సిపల్ కార్యాలయం, హనుమకొండ డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని పరిశీలించారు. భవనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హనుమకొండలోని కనకదుర్గ కాలనీలోని ఎంపీ నివాసంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల, పెన్షనర్లు ఎంపీ డాక్టర్ కావ్యను కలిసి సీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ మంజూరు చేయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వెంటనే భవన పరిశీలనకు చర్యలు తీసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు.

ఎల్ఐసీ ఏజెంట్ల ఆవిర్భావ దినోత్సవం

మట్టెవాడ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): భారతీయ జీవిత బీమా ఏజంట్ల సమాఖ్య (లియాఫి-1964) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం వరంగల్ ములుగు రోడ్డులోని ఎల్ఐసీ వరంగల్ డిస్ట్రిక్ట్ బ్రాంచి ఎదుట జరిగిన లియాఫి ఆవిర్భావ దినోత్సవంలో వరంగల్ డివిజన్ అధ్యక్షుడు పులి సుధాకర్ హాజరై, జెండావిష్కరించారు. అనంతరం ఆవిర్భావ దినోత్సవ కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లియాఫి డివిజన్ రెసిడెంట్ సెక్రటరీ పబ్బా రాజాశ్రీనివాసరావు, ఇన్‌చార్జి ప్రెసిడెంట్ ఆకుల కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి తండా అశోక్, కట్టా తిరుపతిరెడ్డి, భిక్షపతి, మన్నెం ఇంద్రారెడ్డి, ఐదులాపురం సురేందర్, ఎరుకల రఘుణారెడ్డి, చెల్పూరి శ్రీను, రమేష్, జి.సంపత్, వర్నె తిరుపతి, రాజేందర్, సోమయ్య, శ్రీను, సత్యనారాయణ, కోటేశ్వర్, ఆవునూరి కుమారస్వామి, భరత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శివనగర్‌లో చండీహోమం, పూర్ణాహుతి



శివనగర్‌లో పూజలో పాల్గొన్న భక్తులు

ఖిలావరంగల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శివనగర్‌లోని సీతారామచంద్రాలయం, 18వ, డివిజన్ లేబర్‌కాలనీలోని పంచముఖ నాగవీరేంద్రస్వామి దేవాలయంలో లలితా అమ్మ వారి మహిసాసురమర్దిని అలంకరణ, నిజస్వరూపం, విజయదశమి(దసరా) సందర్భంగా చండీహోమం, కుంకుమార్చన, అష్టోత్తర శతనామావళి, పూర్ణాహుతి విశేష పూజలు నిర్వహించారు. స్థానిక భక్తులు అధికసంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అర్చకుడు శ్రీవశ్రీ భోగేశ్వశాస్త్రి, కమిటీ సభ్యులు, రామాలయం అధ్యక్షులు వోడ్నాల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి మంచాల కృష్ణమూర్తి, కోశాధికారి చింతం యాదగిరి, కమిటీ సభ్యులు శ్రీరాం రాజేష్, కొండి రాజమౌళి, ఆడెపు సాంబమూర్తి, సాదుల దామోదర్, మీస సత్యనారాయణ, రావికంటి అశోక్, బత్తుల నవీన్‌కుమార్, ఉప్పల శ్రీనివాస్, శామంతుల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర సాంబయ్య జీవితం స్ఫూర్తిదాయకం

దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్



ఎర్ర సాంబయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీబీఎఫ్ నాయకులు

ఆత్మకూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : సమాజసేవ కోసం జీవితం అంకితం చేసిన ఎర్ర సాంబయ్య ప్రజా జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ అన్నారు. బుధవారం ఆత్మకూరు మండలం నాగయ్యపల్లి గ్రామంలో ఎర్ర సాంబయ్య రెండో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంచు రాజేందర్, ములుగు జిల్లా సాధన సమితి అధ్యక్షుడు ముంజల భిక్షపతి గౌడ్, రజక రిజర్వేషన్ పోరా ట సమితి అధ్యక్షుడు చాపర్తి కుమార్‌గాడ్గేలు మాల వేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కలకోటి మహేందర్, జిల్లా ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ మదా సి సురేష్, రాజు, కట్టమల్లు, రాధారపు అనిల్, గిన్నారపు రాజు, జినుక సంధ్య, కట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్

కేయూ క్యాంపస్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కేయూ ఎడ్యుకేషన్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నల్లాని శ్రీనివాస్ బుధవారం ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వ్యవరించిన కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం నుంచి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నల్లాని శ్రీనివాస్‌కు పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్ లాల్, డీన్ ప్రొఫెసర్ నీలం రాంనాథ్‌కిషన్, ప్రొఫెసర్ కట్ల రాజేందర్, డాక్టర్ కొట్టే భాస్కర్ తదితరులు పుష్ప గుచ్ఛం ఇచ్చి, శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.



ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌కు సన్మానం

వడ్డెపల్లి (ఆంధ్రజ్యోతి) : కాకతీయ వర్సిటీ బీఈడీ కళాశాల ఫుల్ అడిషనల్ చార్జ్ (ఎఫ్ఏసీ) ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ నల్లారి శ్రీనివాస్‌ను పలువురు ఉపాధ్యాయ సంఘాల నేతలు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి మెమెంటోతో కేయూలోని బీఈడీ కళాశాలలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దళిత, గిరిజన టీచర్స్ యూనియన్ (డీజీటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు పెండ్యాల కొమురయ్య, వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు డాక్టర్ సంగాని మల్లేశ్వర్, డాక్టర్ జగన్, హన్మంతరావు, రంగారావు, సుభాష్, మహేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

గిర్మాజిపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ గిర్మాజిపేట పాత కూరగాయల మార్కెట్‌వీధిలో శ్రీదేవి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అన్నదానం చేశారు. ఇంతేజార్ గంజ్ సీఐ షూక్రూ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలు సుఖ సంతోషాలతో సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీగోవిందరాజుల గుట్ట దేవాలయం ప్రధాన అర్చకులు వరయోగుల శ్రీనివాసస్వామి, శ్రీదేవి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కౌశిక్‌తో పాటు యాదగిరి, శశికాంత్, శశి, రజనీష్, బబ్లూ, జస్వంత్, నితిష్, నిఖిల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో రావణవధకు ఏర్పాట్లు పూర్తి

ఖిలావరంగల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే రావణవధ కార్యక్రమంలో భాగంగా బుధవారం శివనగర్, తూర్పుకోటలలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. శివనగర్ సబ్‌స్టేషన్ వద్ద గల బతుకమ్మ ఆటమైదానంతో పాటు ఖిలావరంగల్ రాతికోట సమీపంలో రావణవధ ప్రతిమలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బుధవారం తూర్పుకోటలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు వెల్పుగొండ సువర్ణ-సురేష్ అధ్యక్షతన సమితీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తూర్పుకోటలో రావణవధ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం విభాగాల వారీగా కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని రావణవధ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు కందిమళ్ళ మహేష్, బోయిని దూడయ్య, బేడిద వీరన్న, సంగరబోయిన చందర్, వనపర్తి ధర్మరాజు, గన్నారపు రమేష్, సంగరబోయిన చందర్, సుంచు జగదీశ్వర్, బొలుగొడ్డు శ్రీనివాస్, మేకల కుమార్, పోశాల శ్రీనివాస్, అర్షం రాంబాబు, చింతం రమేష్, బిళ్ల కిషోర్, పెసరు కుమార్, సుంచు వీరన్న, సిరబోయిన వాసుదేవ్, బండి కృష్ణ, ఏసీ రెడ్డి రమేష్, ఉమేష్, రంజిత్, బిళ్ళ హరేందర్, అల్లం కేశవరాజు, కరుణాకర్, నాంద్రే అమర్‌నాద్, మేకల రమేష్, బేర నరేందర్, శివ, నవీన్, ప్రమోద్, జనార్ధన్, ఐలయ్య, ప్రతాప్, కుమార్, కమలాకర్, తదితరు లు పాల్గొన్నారు.



తూర్పుకోట వద్ద సమావేశంలో పాల్గొన్న ఉత్సవ కమిటీ సభ్యులు

వృద్ధ తల్లిదండ్రులను పట్టించుకోవాలి

బాలసముద్రం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను పట్టించుకోని వారి పిల్లలకు వారి ఆస్థులను అనుభవించే హక్కు లేదని సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ డాక్టర్ కె.అనితారెడ్డి అన్నారు. అక్టోబరు 1న ప్రపంచ వృద్ధుల దినోత్సవం గురించి ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రుల వృద్ధుల సంరక్షణ, పోషణ చట్టం అండగా నిలుస్తుందని, కన్నవారిని పట్టించుకోని బిడ్డల విషయంలో ట్రిబ్యునల్ సత్వర విచారణ జరుపుతుందని తెలిపారు. అలాంటి వివాదాల్లో తల్లిదండ్రులు తమ పిల్లలకు బదిలీ చేసిన ఆస్థిపై యాజమాన్య హక్కులు తిరిగి బాధితులకే దక్కేలా ఆదేశించే అధికారం ట్రిబ్యునల్ కోర్టుకు ఉందని చెప్పారు. సీనియర్ సిటిజన్స్‌కు ఎలాంటి సమస్యలు వచ్చినా ట్రిబ్యునల్ బెంచ్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

వినియోగదారుల సేవే బీఎస్ఎన్ఎల్ లక్ష్యం

వరంగల్ డీజీఎం కిషన్



హనుమకొండలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

వడ్డెపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు సమగ్ర సేవలు అందించడమే తమ సంస్థ లక్ష్యమని బీఎస్ఎన్ఎల్ వరంగల్ డీజీఎం కిషన్ అన్నారు. వరంగల్ పోతన నగర్‌లోని బీఎస్ఎన్ఎల్ భవన్ నుంచి హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం ప్రాంతంలోని బీఎస్ఎన్ఎల్ భవనం వరకు ఉద్యోగులు బైక్ ర్యాలీ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ సెప్టెంబరు 27న మేక్ ఇన్ ఇండియా - ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్‌లో భాగంగా దేశీయంగా అభివృద్ధి చేసిన 4జీ నెట్ వర్క్‌ను ప్రారంభించారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ అధికారులు వసంత్‌కుమార్, హరిసింగ్, శేషు, శ్రీనివాస్, బాలు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికులకు చీరెల పంపిణీ

మిల్స్‌కాలనీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా పండగను పురస్కరించుకొని వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేశ్ బుధవారం 36వ డివిజన్ బల్దియా కార్మికులకు చీరెలు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జవాన్ రూపారాణి, అనిల్, జీడబ్ల్యూఎంసీ కార్మికులు పాల్గొన్నారు.



చీరెలు పంపిణీ చేస్తున్న ఆడెపు వెంకటేశ్

దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం

14వ డివిజన్ కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య

వరంగల్‌సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): చిన్న వడ్డేపల్లి చెరువు వద్ద దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని 14వ డివిజన్ ఏనుమాముల దసరా ఉత్సవ సమితి కన్వీనర్, స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య అన్నారు. బుధవారం దసరా ఉత్సవ సమితి నాయకులతో కలిసి వారు చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. చిన్న వడ్డేపల్లి చెరువు వద్ద పెద్దఎత్తున దసరా ఉత్సవాలను నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేయించామన్నారు. ముఖ్య అతిథులుగా మంత్రి కొండా సురేఖ మురళీధర్‌రావు, ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట శాసనసభ్యుడు కెఆర్.నాగరాజుతో పాటు పలువురు ప్రజాప్రతి నిధులు హాజరవుతారని తెలిపారు. వేడుకల సందర్భంగా 35 అడుగుల భారీ రావణాసుర విగ్రహాన్ని తయారు చేయించామన్నారు. ఆకాశంలో మిరుమిట్లుగొలిపే బాణసంచాతో రావణవధ కార్యక్రమం అద్భుత ఆకట్టుకుంటుందన్నారు. ఉత్సవ ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరం, 108 వాహనం, అగ్నిమాపక సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో 14వ డివిజన్‌కు చెందిన రాజకీయ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న దసరా ఉత్సవ సమితి నాయకులు

బీఆర్ఎస్ ఫ్లెక్సీల చించివేత

దసరా ఉత్సవలు జరిగే ప్రాంతంలో మంగళవారం అన్ని పార్టీల నాయకులతో పాటు బీఆర్ఎస్ నాయకులు సైతం ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. కాగా, బుధవారం ఉదయం చూసేసరికి బీఆర్ఎస్ ఫ్లెక్సీలు కొన్ని చినిగి పోయి ఉన్నాయి. దీంతో బీఆర్ఎస్ నాయకులు ఏనుమాముల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆర్థికసాయం అందజేత

హసన్‌పర్తి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎల్‌పీసీ కార్మికుల సంక్షేమం కోసం పాటు పడిన ఎల్లాపూర్‌కు చెందిన సామాజిక ఉద్యమకారుడు రేణికుంట్ల దుర్గా ప్రసాద్‌కు ఎల్లాపూర్ ఎల్‌పీసీ కార్మికులు ఆర్థిక చేయూతనందించి మానవత్వం చాటుకున్నారు. నెలరోజులుగా గుండెపోటుతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడని తెలిసిన తోటి కార్మికులు తాము సేకరించిన విరాళాన్ని దుర్గాప్రసాద్‌కు అందజేసి ఆదుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకుడు వెలిసోజు రమణాచారి, కార్మికులు ఎర్ర సురేందర్, గోపరాజు సాయిలు, తంగేడుపెల్లి తిరుపతి, నార్లగిరి భిక్షపతి, ఇల్లందుల రమేష్, బరిసా ఐలయ్య, కల్వచర్ల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



దుర్గా ప్రసాద్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న ఎల్‌పీసీ కార్మికులు

పద్మాక్షి కాలనీలో నేడు రావణ వధ



హనుమకొండ కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ప్రసిద్ధ పద్మాక్షి ఆలయ ప్రాంగణంలో రావణసుర వధకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు రావణసుర వధ ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, బీజేపీ నేత రావుల సుదర్శన్ చెప్పారు. ఈసారి 36 అడుగుల ఎత్తుగల దశకంఠుడి కాశిబుగ్గకు చెందిన బాంబుల కుమార్‌చే ప్రత్యేకంగా తయారు చేయించామన్నారు. ఉపాధ్యక్షులుగా చీకటి ప్రకాశ్, పూలగంధం రాజారాం, సాంబరాజు రాజ్‌కుమార్, తోట పవన్, పులి రజనీకాంత్, కనుకుంట్ల రవికుమార్, రావుల్‌కార్ అనిల్‌తోపాటు కోమల కిషన్, తోట వెంకన్న, పోతుల శ్రీమాన్‌లు సభ్యులుగా కార్యక్రమాలను మూడున్నర దశాబ్దాలుగా నిర్వహిస్తున్నారు.

హనుమకొండలోని వస్త్రవ్యాపారి, మహేంద్రకపూర్ విగ్రహదాతగా వ్యవహరించారని సుదర్శన్ చెప్పారు. దసరా పర్వదిన వేళ కనీసం 50 వేల నగరవాసుల సమక్షంలో రంగురంగుల బాంబుల మధ్య దశకంఠుడి ప్రతిమను దహనం చేయడం ఆకట్టుకుంటుందని తెలిపారు. స్థానిక శాసనసభ్యుడు నాయిని రాజేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, రావు పద్మ, తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. దసరా సందేశాలు, ప్రత్యేక కోలాటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, రావణసుర వధ ఏర్పాటు చేశామన్నారు. భక్తులందరికీ జమ్మి ఆకు పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు. నగరపాలక సంస్థ దసరా పర్వదిన వేళ పద్మాక్షి ఆలయానికి చేరుకునే భక్తుల కోసం ప్రత్యేక విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడమేకాక రహదారులను మరమ్మతులు చేయించింది. ప్రత్యేక శానిటేషన్ సిబ్బంది సైతం ఏర్పాటు చేసింది.

నేడు మాంసం షాపులు తెరవొద్దు

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో గురువారం గాంధీ జయంతి సందర్భంగా అన్ని మాంసాహార సంస్థలు మూసివేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వ్యాపారులు, మాంసాహార దుకాణాల యజమానులు, విక్రయదారులు, మార్కెట్ నిర్వాహకులు సహకరించి షాపులు మూసివేయాలని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించి ఎక్కడైనా మాంసం, చికెన్ విక్రయాలు నిర్వహిస్తే మునిసిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాంసం విక్రయాలు జరిపినట్టు కనిపిస్తే ట్రేడ్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అదే విధంగా షాపులలో కాకుండా ఎక్కడైనా జంతువధ జరిపితే చర్యలు తప్పవని కమిషనర్ తెలిపారు. మాంసం నియంత్రణ కోసం నగరంలో ప్రత్యేక బృందాలు నగరంలో అన్ని చోట్ల నిఘా పెట్టినట్టు సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి వెల్లడించారు.

అదిగో అంగ'రంగలీల'

- అంబరాన్ని తాకనున్న దసరా సంబరాలు
- 70 అడుగుల ఎత్తైన రావణ ప్రతిమ దహనానికి సర్వం సిద్ధం
- హాజరుకానున్న మంత్రి కొండా సురేఖ, పలువురు ప్రముఖులు
- విస్తృత ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- 88 ఏళ్లుగా కొనసాగుతున్న దసరా వేడుకలు



ఉర్సు గుట్ట వద్ద ఏర్పాటు చేసిన రావణ ప్రతిమ (ఫైల్)



రంగలీల మైదానంలో చేస్తున్న దసరా ఉత్సవ ఏర్పాట్లు

కరీమాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉర్సు గుట్ట రంగలీల మైదానం దసరా సంబరాలకు సిద్ధమైంది. విజయదశమి రోజున (గురువారం) ఘనంగా నిర్వహించే ఈ వేడుకలకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. మరో వైపు దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కూడా ఏర్పాట్లు చేశారు. సుమారు 70 అడుగుల ఎత్తైన రావణ ప్రతిమను బాణసంచాతో దహనం చేస్తారు. ప్రత్యేక ఆకర్షణగా లేజర్ లైట్ షో, బాణసంచా మెరుపులు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట, పాటలు ప్రజలను అలరించనున్నాయి. వేడుకల్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరానున్నారు.

ఉత్సవాల్లో తొలుత కరీమాబాద్ రామాస్వామి దేవాలయం నుంచి రథంలో శ్రీసీతారామచంద్రస్వామి, లక్ష్మణ సహిత, హనుమాన్ ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసి, ఊరేగింపుగా ఉర్సు గుట్ట రంగలీల మైదానానికి తరలిస్తారు. రథం వస్తున్న సమయంలో జై శ్రీరాం, జై హనుమాన్ అంటూ ప్రజలు శ్రీరామనామస్మరణ చేస్తారు. ఇక ఉత్సవాల్లో పలు కార్యక్రమాలు ప్రజలను అలరిస్తాయి. కళాకారుల నృత్య ప్రదర్శనలు, ఆట, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, మిరుమిట్లు గొలిపే ప్రత్యేక బాణసంచా మెరుపులు ఆకట్టుకుంటాయి. ఈ వేడుకలు సాయంత్రం 7గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు కొనసాగుతాయి.

హాజరు కానున్న పలువురు ప్రముఖులు

దసరా వేడుకలకు ముఖ్య అతిథులుగా పలువురు రాజకీయ నాయకులు, అధికారులు హాజరుకానున్నారు. అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మురళీధర్‌రావు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, మేయర్ గుండు సుధారాణి, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కలెక్టర్ సత్యశారద, సీపీ సన్‌ప్రీత్ సింగ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ సలీమా, 'కుడా' చైర్మన్ వెంకట్రాంరెడ్డి, ఏఎస్పీ శుభం ప్రకాష్, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు గోపాల నవీన్‌రాజు, పలువురు ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులతో పాటు, స్థానిక కార్పొరేటర్లు తదితరులు హాజరవుతారు.

8 దశాబ్దాల చరిత్ర

ఉర్సు రంగలీల మైదానంలో నిర్వహించే దసరా ఉత్సవాలకు 87 ఏళ్ల చరిత్ర ఉంది. నాడు ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో 2 వేల మందితో ప్రారంభమైన ఉత్సవాలు నేడు లక్షలాది జనాలను రప్పించే స్థాయికి ఎదిగాయి. తొలినాళ్లలో దసరా ఉత్సవాలలో ఉర్సు గుట్టపై రావణుడి పటాన్ని తగిలించేవారు. కరీమాబాద్ రామస్వామి దేవాలయం నుంచి రథంపై సీతారామ, లక్ష్మణ, హనుమాన్ విగ్రహాలతో రథయాత్ర ఊరేగింపుగా సాగుతూ, చిడతల రామాయణం, కోలాటాలు, భజనల మధ్య నృత్యాలు చేసుకుంటూ మైదానానికి చేరుకునేవారు. ఆకాశంలో పాలపిట్ట, గరుత్మంతుడి దర్శనానంతరం వీక్షకులు చప్పట్లతో సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యేవారు. అప్పటికే గుర్రంపై వచ్చిన వ్యక్తి లైసెన్స్ కలిగిన తుపాకితో గుండుకు కట్టిన రావణుడి పటాన్ని పేల్చేవాడు. దీంతో రావణుడి పటం చెల్లాచెదురుగా పడిపోవడంతో ప్రజలు ఆ పటం ముక్కలను స్నేహితులకు, బంధువులకు, ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుకునే వారు. తల్లిదండ్రులకు ఇచ్చి ఆశీర్వాదాలు తీసుకునేవారు. పటం సంస్కృతిని కరీమాబాద్ ప్రాంతానికి చెందిన గంజి పంచయ్య 40 ఏళ్లపాటు కొనసాగించాడు. 1967లో దసరా ఉత్సవ కమిటీ ఏర్పడింది. వ్యవస్థాపక అధ్యక్షుడిగా మార్గం శంకర్ 30 ఏళ్లు కొనసాగారు. తరువాత వడ్నాల చంద్రమౌళి 4 సంవత్సరాలు, నాగపూరి వెంకటస్వామి 18 ఏళ్లు బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం నాగపూరి సంజయ్‌బాబు అధ్యక్షుడిగా ఉన్నారు.

పార్కింగ్ ప్రదేశాలు....

దసరా వేడుకలను తిలకించేందుకు వచ్చే వాహనాలను పార్కింగ్ చేసేందుకు దసరా ఉత్సవ కమిటీ, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఉర్సు గుట్ట సమీపంలో పలు పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేశారు. హన్మకొండ నుంచి వచ్చే వాహనాలు జేఎస్ఎం పాఠశాల వద్ద, నాయుడు పెట్రోల్‌పంపు నుంచి వచ్చే వాహనాలను తాళ్ల పద్మావతి కళాశాల వద్ద, వరంగల్ నుంచి వచ్చే వాహనాలను బీరన్నగుడి ప్రదేశాల్లో పార్కింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

నేడు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

వరంగల్ క్రైం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఉర్సు రంగలీల మైదానంలో దసరా ఉత్సవాల నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 3వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ట్రైసిటీ పరిధిలో వాహనాలు మళ్లిస్తున్నట్లు సీపీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు.

- ఖమ్మం నుంచి వరంగల్ మీదుగా కరీంనగర్, హైదరాబాద్ వెళ్లే వాహనాలు పున్నేలు క్రాస్, ఐనవోలు ఆర్చ్, వెంకటాపురం, కరుణాపురంగా మీదుగా వెళ్లాలి.
- కరీంనగర్ నుంచి ఖమ్మం వెళ్లాల్సిన వాహనాలు కొత్తపేట, ఏనుమాముల, లేబర్‌కాలనీ, తెలంగాణ జంక్షన్, ఫోర్ట్‌రోడ్డు మీదుగా వెళ్లాలి.
- హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్లాల్సిన వాహనాలు కరుణాపురం, వెంకటాపురం, ఐనవోలు, పున్నేలు నుంచి వెళ్లాలి.

ఉత్సవాలకు వచ్చే వాహనాలకు పార్కింగ్

- హనుమకొండ హంటర్‌రోడ్డు నుంచి ఉర్సు గుట్ట వచ్చే వాహనాలు కొలంబో ఆస్పత్రి, బీఆర్‌నగర్ ఎదురుగా గానుగ ఆయిల్ పాయింట్, ఆకుతోట కన్వెన్షన్ హాల్, నాని గార్డెన్, జేఎస్ఎం స్కూల్‌లో పార్కింగ్ చేయాలి.
- కడిపికొండ నుంచి వచ్చే వాహనాలను భారత్‌పెట్రోల్ పంపు దగ్గర పార్కింగ్ చేయాలి.
- ఆర్టీవో జంక్షన్ నుంచి వచ్చే వాహనాలు లక్ష్మీ ఫంక్షన్‌హాల్ మైదానం, తాళ్ల పద్మావతి కళాశాల దగ్గర పార్కింగ్ చేయాలి.
- కరీమాబాద్ నుంచి వచ్చే వాహనాలు బీరన్న గుడి దగ్గర పార్కింగ్ చేయాలి.

మటన్ ముక్క.. మందు సుక్క..

- గ్రామాల్లో దసరా పండుగ జోష్ ● పెద్ద ఎత్తున గొర్రెలు, మేకల కొనుగోళ్లు
- కలిసివచ్చిన స్థానిక ఎన్నికల వాతావరణం ● ఆశావహుల ఇళ్లల్లో మద్యం డంపులు

లింగాలఘణపురం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి. దీనినే దసరా పండుగగా జరుపుకుంటారు. ఈ పర్వదినం సకల శుభాలకు జయాలను ప్రసాదిస్తూ జనహృదయాల్లో ఉత్సాహాన్ని నింపే ప్రత్యేక పండుగ. ఈ పండుగ రోజున శమీ (జమ్మి)వృక్షానికి పూజలు చేసి, పాలపిట్టను దర్శనం చేసుకుంటే ఏడాది పొడవునా శుభాలు కలుగుతాయని నమ్మకం. ఉద్యోగ రీత్యా, బతుకుదెరువు కోసం స్వగ్రామాలను వదిలి పట్నం వెళ్లిన వారంతా రెండు రోజులుగా ఊళ్లకు చేరుకుంటున్నారు. మందు సుక్క.. మటన్ ముక్క దసరా ప్రత్యేకత.. ఎంతటి పేదవాళ్లయినా సరే కొత్తదుస్తులను ధరించి తమ శక్తిసామర్థ్యాల మేరకు పండుగను నిర్వహించుకుంటారు.

జమ్మిచెట్టు వద్ద పూజలు నిర్వహించిన అనంతరం జమ్మి ఆకును పంచుతూ అలాయ్‌బలాయ్ తీసుకుంటారు. అంతే కాదు.. తమ రక్తసంబధీకుల కుటుంబాలకు చేరుకుని పెద్దల చేతికి జమ్మి అందించి పాదనమస్కారాలతో ఆశీస్సులను అందుకుంటారు. ఏడాది పొడవునా బంధుమిత్రుల నడుమ అక్కడక్కడ చిన్నా చితక గొడవలు ఏమైనా ఉంటే దసరా పండుగ రోజున వాటిని పటాపంచలు చేసి ఆత్మీయ ఆలింగనాలతో ప్రేమను పంచుకుంటారు.

వాహనపూజలు.. విందు భోజనాలు..

దసరా పండుగ రోజున ప్రతీ ఒక్కరు తమ గ్రామంలోని దేవాలయాలకు వెళ్లి ప్రత్యేకపూజలను చేసుకుంటారు. వాహనపూజలు చేయడం కడాఆ ఆనవాయితీగా వస్తోంది. ఇందుకోసం వాహనాలను శుభ్రంగా కడిగి పూలతో అలంకరించి పూజలు చేస్తారు. అనంతరం బంధుమిత్రుల కోసం పెద్ద ఎత్తున విందుభోజనాలను ఏర్పాటు చేసుకోవడం తరతరాలుగా వస్తున్న ఆనవాయితీ. ఆత్మీయులను దసరా పండుగ సందర్భంగా ఇంటికి ఆహ్వానించి భోజనం పెట్టేందుకు గొర్రెలను, మేకలను పెద్దఎత్తున కోసి మాంసాహార విందు చేస్తారు. ఇందుకోసం వారం రోజులుగా గొర్రెలు, మేకల కొనుగోళ్లు పెద్ద ఎత్తున చేపట్టారు.

పాలపిట్ట దర్శనమయ్యేనా..

పూర్వపు రోజులతో పోల్చుకుంటే అభివృద్ధిపేరిట జరుగుతున్న విధ్వంసాలు అనేక పక్షిజాతుల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఇప్పటికే తాతముత్తాతలు పరిచయం చేసిన వేలాది పక్షిజాతులు కనుమరుగైపోయాయి. వాటి బాటలోనే ఇప్పుడు పాలపిట్టలు కూడా కనిపించకుండా పోతున్నాయి. తరతరాలుగా వస్తున్న సంప్రదాయంలో భాగంగా గ్రామాల్లో ఉన్న గడీల వద్ద దసరా పూజలు చేసిన అనంతరం సొరకాయను పెద్ద కత్తితో నరికి పూజలకు శ్రీకారం చుడుతారు. అనంతరం జమ్మివృక్షం వద్ద పూజలు చేసి జొన్నచేలు, ఇతర ఆహారధాన్యాల పంటలపై వాలే పాలపిట్ట దర్శనం కోసం పంట పొలాలవైపు పరుగులు తీస్తారు. కొన్నేళ్లుగా అక్కడ పాలపిట్ట కంటికి కనిపించడం గగనమైపోతోంది.

ముందస్తుగానే మద్యం కొనుగోళ్లు..

దసరా అంటేనే మద్యం ఏరులై పారడం.. సాధారణ పండుగలకంటే ఒకట్రెండు పెగ్గులు అదనంగా వేయడం.. ఈ



పండుగ ప్రత్యేకత.. సరిగ్గా ఇలాంటి పండుగనాడే గాంధీ జయంతి రావడంతో ఊరూరా మద్యం కొనుగోళ్లు రెండు మూడురోజుల ముందు నుంచే షురూ అయ్యాయి. గాంధీ జయంతి సందర్భంగా మద్యం షాపులు మూసేస్తారని ప్రతీ ఒక్కరూ అవసరానికి మించి మద్యం బాటిళ్లను కొనుగోలు చేసుకుని ఇళ్లల్లో భద్రపర్చుకున్నారు. గాంధీ జయంతి నాడు జీవహింస చేయరాదనే నిబంధనతో ఊళ్లల్లో బుధవారం రాత్రి నుంచే యాటలను బలిచ్చే పనిలో నిమగ్నమైపోయారు.

ఊళ్లల్లో ముందస్తు దసరా జోరు..

అన్ని దసరా పండుగలతో పోల్చుకుంటే ఈ సారి దసరా పండుగ కొత్త కిక్కును తెచ్చిపెట్టింది. రెండేళ్లుగా ఎదురు చూస్తున్న స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ రావడంతో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఆశావహులు పోటాపోటీగా దసరా వేడుకలను ముందస్తుగానే నిర్వహిస్తున్నారు. తమ అనుచరగణంతో గ్రామస్థులను పోగు చేసి వ్యవసాయ బావుల వద్ద, దాబాలు, రెస్టారెంట్ల వద్ద ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి దసరా దావత్‌లు ఇస్తుండటం గమనార్హం. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఆశావహులు అడ్వాన్స్‌గా తమకు అవసరమైన మద్యాన్ని పెద్దమొత్తంలో కొనుగోలు చేసుకుని ఇళ్లల్లో డంపులుగా భద్రపర్చుకుంటున్నారు. పట్టణప్రాంతాలకు వలసవెళ్లిన కుటుంబాలు పండుగ నిమిత్తం స్వగ్రామాలకు చేరుకుంటుండంతో వచ్చిన వాళ్లను వచ్చినట్లుగా తమ బుట్టలో వేసుకునేందుకు ఆశావహులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అప్పుడే ఇళ్లచుట్టూ తిరుగుతూ మంచి చెడులను అడిగి రానున్న ఎన్నికల్లో తాను సర్పంచ్‌గా పోటీ చేస్తున్నాని ఓట్లన్నీ గంపగుత్తగా తనకే వేయాలని మచ్చిక చేసుకునే పనిలో ఆశావహులు నిమగ్నమవుతున్నారు.

నేడు కేసముద్రం పోలీస్ సర్కిల్ ప్రారంభం

● ఇనుగుర్తి పోలీస్‌స్టేషన్ కూడా



కేసముద్రం సీఐ కార్యాలయం ఏర్పాటు చేయబోతున్న పోలీస్‌స్టేషన్

కేసముద్రం/ఇనుగుర్తి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం పోలీస్ సర్కిల్, ఇనుగుర్తి పోలీస్‌స్టేషన్‌ను గురువారం ప్రారంభించనున్నట్లు పోలీసు అధికారులు బుధవారం తెలిపారు. కేసముద్రం పోలీస్‌స్టేషన్‌లోనే సీఐ ఛాంబర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో డీసీఆర్‌బీ, ఎస్‌బీ విభాగంలో సీఐగా పనిచేస్తున్న సత్యనారాయణను కేసముద్రం సీఐగా నియమించినట్లు తెలిసింది. ఇనుగుర్తిలో సొసైటీ ఎరువుల విక్రయ కేంద్రం సమీపంలోని ప్రైవేటు భవనంలో నూతన పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్నారు. ఈ పోలీస్‌స్టేషన్‌కు ఇన్‌చార్జి ఎస్ఐగా కేసముద్రం ఎస్ఐ-2 జి.కరుణాకర్‌ను కేటాయించినట్లు మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు.

ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలి

● వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిచాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు నియమించిన జోనల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లతో బుధవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంబంధిత అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఫర్నిచర్, టాయిలెట్, లైటింగ్, వెబ్‌కాస్టింగ్ తదితర కనీస సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. జోనల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు సమన్వయంతో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని, పోలింగ్ తేదీకి ఒక రోజు ముందే సిబ్బంది అక్కడ ఉండేటట్లు చూసుకోవాలని తెలిపారు.

వర్ధన్నపేట మండలంలోని శివరాంపూర్ వద్ద, పర్వతగిరి మండలంలోని చింతనెక్కొండ వద్ద, జాన్‌పీరీలు తదితర ఐదు సరిహద్దు ప్రాంతాల్లో స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశామని, అదే విధంగా ప్రతీ మండలానికి ఒక ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాట్లు చేశామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రశాంత వాతావరణం కల్పించడం ప్రధాన బాధ్యత అని కలెక్టర్ గుర్తు చేశారు. అన్ని శాఖలు సమన్వయం చేసుకొని జిల్లాలో ఎన్నికలు నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీపీవో కల్పన, డీబీసీడీవో పుష్పలత, డిప్యూటీ సీఈవో వసుమతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

నేడు భద్రకాళి మహాదర్శనం

- చక్రస్నానం, అమ్మవారికి పట్టాభిషేకం ● సాయంత్రం జల క్రీడోత్సవం
- దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు, వసతుల ఏర్పాటు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): భక్తకోటి ఇలవేల్పు భద్రకాళి అమ్మవారు గురువారం నిజ రూపంలో దర్శనమిస్తారు. దసరా రోజున అమ్మవారిని దర్శించుకుంటే అన్ని విజయాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఉదయం 5 గంటల నుంచి భక్తులకు మహాదర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఉదయం 3 గంటలకే నిత్యపూజ నిర్వహించి అపరాజిత పూజ, ఆయుధ పూజ, శమీ పూజ, చక్రస్నానం, సామ్రాజ్య పట్టాభిషేకం, చూర్ణోత్సవం, ధ్వజారోహణం నిర్వహిస్తామని ప్రధానార్చకుడు భద్రకాళి శేషు తెలిపారు. సాయంత్రం అమ్మవారికి జల క్రీడోత్సవాన్ని నిర్వహిస్తారు. ప్రస్తుతం భద్రకాళి చెరువు ప్రాంగణంలో మాడవీధులు నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో జల క్రీడోత్సవాన్ని ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తారు. ఒక తాంబాలంలో నీరు పోసి ఒక పత్రం వేసి పేపరు పడవను తయారు చేసి అందులో గౌరమ్మను పేర్చి జల క్రీడోత్సవాన్ని నిర్వహిస్తామని శేషు తెలిపారు. దాదాపు 50 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని ఆలయ ఈవో తెలిపారు. భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు, తాగునీటి వసతి ఏర్పాట్లు చేశామని, భద్రకాళి సేవా సమితి ఐతా గోపీనాథ్ ఆధ్వర్యంలో సేవా సమితి సభ్యులు 6 క్వింటాళ్ల ఆరు రకాల ప్రసాదాలను ఉచితంగా అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

అధిక డబ్బుల ఆశచూపి మోసం

- చైన్ సిస్టం పేరిట దగా చేస్తున్న ముఠా అరెస్టు ● వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): అధిక డబ్బులు ఆశచూపి కోట్లు కొల్లగొట్టిన ముఠా సభ్యులను టాస్క్‌ఫోర్స్ పాలకుర్తి పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. అలాగే నిందితుల నుంచి రూ.5 లక్షల 29 వేల నగదుతో పాటు 684.5 గ్రాముల బంగారు నాణాలు, 150 గ్రాముల బంగారు ఆభరణాలు, కారు, ల్యాప్‌టాప్, భూపత్రాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు.

జనగామ జిల్లా పాలకుర్తిలో నివాసం ఉంటున్న సూర్యాపేట జిల్లాకు చెందిన తెప్పాలి సైదులు (55), ఆంధ్రప్రదేశ్ నందిగామకు చెందిన మనబోతుల రామకృష్ణ, సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్‌కు చెందిన పొడిల సురేశ్‌కుమార్, హుజూర్‌నగర్‌కు చెందిన పొడిల శ్రీధర్ ముఠాగా ఏర్పడి 2023లో సైదులు భార్య నారాయణమ్మ పేరు మీద హెబ్సిబా అనే ఓ సంస్థను స్థాపించారు. అనంతరం 2024లో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అధిక లాభాల ఆశచూపి చిట్టీల వ్యాపారం ప్రారంభించారు. చిట్టీలో చేరే సభ్యులు రూ.6వేలు చెల్లిస్తే రూ.4వేలు తన దగ్గర డిపాజిట్ చేసుకొని రూ.2వేల విలువ చేసే బహుమతులు ఇస్తానంటూ నమ్మించి రూ.300



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, నగదు, వస్తువులు

విలువైన వస్తువులను అందజేసేవారు. ఈ మేరకు చిట్టీలో చేరిన సభ్యుడికి 20నెలల పాటు నెలకు వెయ్యి చొప్పున అందజేసేవారు. అంతేకాక ప్రధాన నిందితుడు మిగతా నిందితులతో కలిసి గ్రామాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని సుమారు 28,493 సభ్యత్వాలను నమోదు చేయించాడు. సభ్యుల నుంచి రూ.4వేల చొప్పున రూ.11కోట్ల 39 లక్షలను వసూలు చేశాడు. ఇదే కాకుండా రూ.2వేల విలువైన బహుమతులు అని చెప్పి కేవలం రూ.300 విలువైన బహుమతులు ఇవ్వడం ద్వారా రూ.4 కోట్ల 84 లక్షలు మోసం చేసినట్లుగా గుర్తించామన్నారు.

కాగా, వీటికి సంబంధించిన మోసాలపై బాధితులు ప్రధాన నిందితుడు సైదులపై గతంలో మెదక్, సూర్యాపేట, జిల్లాలతో పాటు ఇల్లందు, ఎల్‌బీ నగర్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 10 కిపైగా చీటింగ్ కేసులు నమోదైనట్లు సీపీ వెల్లడించారు. దీంతో ప్రజలను మోసం చేసి 17 బ్యాంకుల్లో జమచేసిన రూ.5కోట్ల 48 లక్షల64 వేలకు సంబంధించిన లావాదేవీ ఖాతాలను నిలిపివేశామన్నారు. సమావేశంలో వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, వర్ధన్నపేట, టాస్క్‌ఫోర్స్ ఏసీపీలు నర్సయ్య, మధుసూదన్, టాస్క్‌ఫోర్స్, పాలకుర్తి ఇన్‌స్పెక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ అమ్మ'కం..బాదుడు'



- పండగల వేళ.. పెరిగిన ఆన్‌లైన్ కొనుగోళ్లు..
- ఈ-కామర్స్ సైట్లలో భారీగా అక్రమాలు
- ప్లాట్‌ఫామ్, ఆఫర్, హ్యాండ్లింగ్ ఫీజుల పేరుతో భారీగా వడ్డన
- నో రీఫండ్.. రిటర్న్ ఆప్షన్ తొలగిస్తున్న వైనం..
- తప్పుడు ప్రొడక్టు వచ్చినా స్పందించని వైనం

హనుమకొండ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ-కామర్స్ సంస్థలు వచ్చిన తర్వాత జనం షాపులకు వెళ్లి వస్తువులు కొనడమే దాదాపుగా మానేశారు. స్మార్ట్ ఫోన్ చేతిలోకి తీసుకోవడం, నచ్చిన ప్లాట్‌ఫాంను ఎంచుకోవడం.. కావాల్సినవి ఆర్డర్ పెట్టుకోవడం.. వారం రోజుల్లో అవి మన గడప దగ్గరకు వచ్చి చేరడం జరిగిపోతోంది. ఈ సులభతర పద్ధతుల కారణంగా మధ్యతరగతి ప్రజలు ఆన్‌లైన్ కొనుగోలు వైపు మొగ్గు చూపుతున్నారు. దీనికి తోడు అన్ని బ్యాంకులు క్రెడిట్, డెబిట్ కార్డుల పేరుతో భారీ డిస్కౌంట్లు ఇస్తుండడంతో.. స్థానిక మార్కెట్లను పూర్తిగా మర్చిపోయారు. ఇదే ఈ-కామర్స్ సంస్థలకు వరమైంది. ఈ పరిస్థితిని అడ్డం పెట్టుకుని ఇష్టం వచ్చినకాడికి వినియోగదారులపై బాదుడు మొదలు పెట్టాయి. రకరకాల ఫీజుల పేరుతో జేబులు ఖాళీ చేస్తున్నాయి. రానున్న దసరా, దీపావళి పండగల సందర్భంగా వచ్చే డిస్కౌంట్ ఆఫర్లతో అప్రమత్తంగా లేకపోతే నష్టపోవడం ఖాయం.

రకరకాల ఫీజుల మోత..

దేశంలో ప్రముఖ పండుగలు దసరా, దీపావళి సందర్భంగా భారీ స్థాయిలో కొనుగోళ్లు జరుగుతుంటాయి. సగటున ప్రతి వంద మంది కొనుగోలుదారుల్లో 70 మంది ఈ-కామర్స్ సంస్థల ద్వారానే వస్తువులు కొనుక్కుంటున్నారని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. వీరందరి నుంచి ఈ సంస్థలు వివిధ రూపాల్లో అదనపు ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఒక ఈ-కామర్స్ సంస్థ తన వెబ్‌సైటును వినియోగించుకున్నందుకు ప్లాట్‌ఫాం ఫీజు కింద రూ.5 నుంచి రూ.15, సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ఫీజు పేరుతో రూ.49 నుంచి రూ.59 వసూలు చేస్తోంది. అలాగని ఆర్డర్ పెట్టిన వస్తువు రాకపోతే మాత్రం సంస్థ బాధ్యత తీసుకోవడం లేదు. వీటితో పాటు ఆఫర్ హోల్డింగ్ ఫీజు పేరుతో రూ.149, ఎక్స్‌చేంజ్ ఆఫర్ కింద పికప్ చార్జీ పేరుతో రూ.99 నుంచి రూ.199 వరకూ వసూలు చేస్తోంది. తాజాగా మరో సంస్థ కూడా ఇదే తరహాలో ఫీజుల వసూలు మొదలు పెట్టింది.

వస్తువు రాకుంటే ఫీజులు గల్లంతే..

ఇంత ఖర్చు చేసి ఒక వస్తువును ఆర్డర్ చేస్తే అది వినియోగదారుడి చేతికి అందితే అదృష్టమే. అందలేదంటే ఆ ఫీజులు మొత్తం పోయినట్లే లెక్క! ఆర్డర్ చేసిన తర్వాత ఆ వస్తువు అమ్మకందారు పంపించకపోయినా, అతడే ఆర్డర్ క్యాన్సిల్ చేసినా సరే.. అదనంగా చెల్లించిన ఫీజులు తిరిగి రావు. కేవలం వస్తువు ఖరీదు మాత్రమే వస్తోంది. దీంతో వినియోగదారులు అనేక మంది లబోదిబోమంటున్నారు. సేవలను అందించామనే పేరుతో ఈ కామర్స్ సంస్థలు ఫీజులు మాత్రం తిరిగి ఇవ్వడం లేదు. ఇటీవలి కాలంలో ఇలాంటి ఫిర్యాదులు వేల సంఖ్యలో వస్తున్నాయి.

థర్డ్ పార్టీలతో ప్రమాదం..

ఈ-కామర్స్ సంస్థలు నమ్మకస్తులైన అమ్మకందారులనే వినియోగదారుల ముందుకు తీసుకురావాలి. కానీ, ఇటీవల థర్డ్ పార్టీ అమ్మకందారులను కూడా తీసుకువస్తున్నాయి. వారు ఇచ్చే ఆఫర్లను బ్యానర్లుగా కూడా ప్రమోట్ చేస్తున్నాయి. ఈ కారణంగా ఎక్కువమంది వాటి ఉచ్చులో పడుతున్నారు. తీరా వారు ఆర్డర్ చేసుకున్న ప్రొడక్టు పాతది లేక.. రీ ఫర్బిష్డ్ రావడమో జరుగుతోంది. ఈ విషయం తెలియక చాలా మంది వాటిని కొత్త వస్తువులుగా భావించి మోసపోతున్నారు. ఒకవేళ వాటిని గుర్తించినా.. రిటర్న్ చేయడానికి అవకాశం కూడా ఉండడం లేదు.

రిటర్న్ విండో మూసివేత..

ఈ-కామర్స్ సంస్థలు క్రమంగా రిటర్న్ విండోను మూసేస్తున్నాయి. తొలి నాళ్లలో నెల రోజులపాటు రిటర్న్ ఆప్షన్ అందు బాటులో ఉండేది. ఈ సమయంలో ప్రొడక్టుకు ఏదైనా సమస్య వస్తే తిరిగి పంపించే అవకాశం ఉండేది. తిరిగి కొత్త ప్రొడక్టును గానీ, లేదా చెల్లించిన మొత్తాన్ని కానీ రీఫండ్ చేసేవారు. తర్వాత ఈ సమయాన్ని పక్షం, వారం రోజులకు కుదించారు. ఇప్పుడైతే పూర్తిగా ఆ ఆప్షన్ను ఎత్తేశారు. రీప్లేస్‌మెంట్ అవకాశాన్ని మాత్రమే ఇస్తున్నారు. ఇందులో కూడా సర్వీస్ సెంటర్ రీప్లేస్‌మెంటు ఆప్షన్‌ను మాత్రమే ఎక్కువగా ఇస్తున్నారు. అంటే వస్తువు ఒకసారి వినియోగదారుడి చేతికి చేరిందంటే ఆ వస్తువుతో ఈ-కామర్స్ సంస్థకు ఎలాంటి సంబంధం లేదన్నమాట! ఆ వస్తువును తీసుకుని సంబంధిత కంపెనీ సర్వీస్ సెంటర్ చుట్టూ తిరగాల్సిందే! ఆథరైజ్డ్ సెల్లర్ దగ్గర తీసుకున్న ప్రొడక్టు అయితేనే సర్వీస్ సెంటర్ సేవలు అందిస్తుంది. థర్డ్ పార్టీ సెల్లర్ దగ్గర తీసుకుంటే మాత్రం ఇక అంతే సంగతులు. ఈ నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండడం ఎంతైనా అవసరం.

విశాఖస్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి

కేయూ క్యాంపస్ అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని తెలంగాణ స్టూడెంట్ ఫోరం జిల్లా కన్వీనర్ శ్రీధర్ పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండలోని జరిగిన టీఎస్ఎఫ్ సమావేశంలో శ్రీధర్ మాట్లాడారు. తెలుగు ప్రజల ఏకైక ఉక్కు పరిశ్రమను కేంద్రం ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. యువత ప్లాంట్ వ్యతిరేకంగా ఉద్యమించాలని అన్నారు. 1980లో 32 మంది ప్లాంట్ వ్యతిరేకించినవారిని పోలీసులు హతమార్చారని ఆందోళన వ్యక్తం చేశారు. అమరుల స్ఫూర్తితో యువత ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవాలని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కార్పొరేట్‌కు కట్టబెట్టే కుట్రలను అధిగమించాలని అన్నారు. పరిశ్రమను నమ్ముకుని ఉన్న కుటుంబాలు రోడ్డున పడుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో రాజు, సందీప్, అంజి, సుమన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధికి ఊపిరి

- పీఎం వికసిత్ భారత్ ఉద్యోగ యోజన పథకం
- ఉపాధి అవకాశాల మెరుగే లక్ష్యంగా ప్రారంభం
- పరిశ్రమల యజమానులకు ప్రోత్సాహకాలు
- గత నెల ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో ఇంకా జోరందుకోని ప్రచారం



హనుమకొండ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధికి ఆటంకంగా నిలుస్తున్న నిరుద్యోగ రేటును తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఉద్యోగ సృష్టిని ప్రోత్సహించడం, ముఖ్యంగా యువత, తక్కువ నైపుణ్యం గలవారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రధాన మంత్రి వికసిత్ భారత్ ఉద్యోగ యోజన పథకాన్ని (పీఎంవీబీఆర్‌వై) ప్రవేశపెట్టింది. దీనినే ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకం (ఈఎల్ఐ) అని కూడా అంటారు. దేశంలో ఉపాధి అవకాశాల పెంపు, సంస్థల సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం, అన్ని రంగాల్లో సామాజిక భద్రతపై భరోసా కల్పించడం.. దేశవ్యాప్తంగా 1.96 కోట్ల మందికి ప్రయోజనం సమకూర్చాలన్నది ఈ పథకం ఉద్దేశం.

వంద కోట్లతో..

2025 ఆగస్టు 1వ తేదీన ఈ పథకం ప్రారంభమైంది. ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి 2027 జూలై 31వ తేదీ మధ్యకాలంలో పరిశ్రమల్లో ఉద్యోగాలు పొందినవారికి, ఉద్యోగాలు ఇచ్చిన పరిశ్రమలకు ఈ పథకం వర్తిస్తుంది. కేంద్రం రూ.99,446కోట్లతో ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం రెండు భాగాలుగా ఉంటుంది. ఒక భాగం ఉద్యోగులపై, మరొక భాగం ఉద్యోగాలు కల్పించే పరిశ్రమ యాజమాన్యాలకు సంబంధించింది. ఈ పథకం దేశవ్యాప్తంగా యువతకు కొత్త అవకాశాలను సృష్టించి వారి ఆర్థిక స్థిరత్వానికి దోహదపడుతుంది. పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన కేవలం ఉపాధి కల్పన మాత్రమే కాకుండా భారత దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషించగలదని ప్రభుత్వం ఆశిస్తోంది.

యాజమాన్యాలకు ప్రయోజనాలు

అన్ని రంగాల్లో అదనపు ఉద్యోగాల సృష్టికి ప్రోత్సాహకాలు, ముఖ్యంగా తయారీ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తారు. 50 మంది ఉద్యోగులు ఉన్న సంస్థలు (కొత్తవైనా, పాతవైనా) 2025 ఆగస్టు నుంచి 2027 జూలై 31 మధ్య కనీసం ఇద్దరు ఉద్యోగులను నియమించుకోవాలి. 50మందికి మించి సిబ్బంది ఉంటే కనీసం ఐదుగురికి కొలువునివ్వాలి. భవిష్య నిధి సేవలను సంస్థపరంగా విధిగా కొనసాగిస్తుండాలి. సంస్థలకు ప్రోత్సాహకంగా నెలకు రూ.3వేల చొప్పున.. రెండేళ్లు తయారీ సంస్థలైతే నాలుగేళ్లపాటు ఇస్తారు. యజమానులు తమ ఎంప్లాయర్ పోర్టల్‌లో పీఎంవీబీఆర్‌వై లింక్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలి. పరిశ్రమల యజమానులకు చెల్లింపులు నేరుగా వారి పాన్ లింక్డ్ ఖాతాలోకి జమ అవుతాయి. తెలంగాణ సామాజిక ఆర్థిక సర్వే 2023-24 ప్రకారం హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో 21వేలకు పైగా తయారీ, 1.10 లక్షలకు పైగా సేవా రంగ సంస్థలు ఉన్నట్టు తేలింది.

ఉద్యోగులకు లబ్ధి ఇలా..

అన్ని వ్యవస్థీకృత రంగాల్లో కొత్తగా ఉద్యోగంలోకి వచ్చేవారికి ఒక నెల వేతనం (గరిష్ఠంగా రూ.15వేలు) రెండు విడతలుగా నేరుగా ఖాతాలో జమ అవుతాయి. మొదటి విడత ఆరు నెలల సేవ అనంతరం, రెండో విడత 12 నెలల సేవ, ఆర్థిక సాక్షరత కార్యక్రమం పూర్తి చేసిన తర్వాత జమ అవుతాయి. కాకుంటే ఆరునెలల పాటు విధిగా పని చేయాలి. నెలకు రూ.లక్ష జీతం మించిన వారికి ఈ పథకం వర్తించదు. ప్రోత్సాహక మొత్తంలో కొంత పీఎఫ్‌లో జమ చేస్తారు. పొదుపు అలవాటును పోత్సహించడానికి, ప్రోత్సాహక రాశిలో ఒక భాగాన్ని నిర్దిష్ట కాలానికి డిపాజిట్ ఖాతాలో నిల్వ చేస్తారు. ఆ మొత్తాన్ని ఉద్యోగి తరువాత కాలంలో ఉపసంహరించుకోవచ్చు. మొదటిసారి ఉద్యోగంలో చేరేవారికి అన్ని చెల్లింపులు ఆధార్ బ్రిడ్జ్ పేమేంట్ సిస్టమ్ (ఏబీపీఎస్) ఉపయోగించి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) మోడ్ ద్వారా జరుగుతాయి.

ప్రచారం ఏదీ..

ఈ పథకం గురించి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పరిశ్రమల నిర్వాహకులకు అవగాహన లేదు. ఇప్పటి వరకు పెద్దగా ప్రచారమూ లేదు. పథకం ప్రారంభమై నెలన్నర పైనా కావొస్తున్నా.. దీనిని గురించి పరిశ్రమల నిర్వాహకులకు, ఉద్యోగులకు పెద్దగా అవగాహన లేదు. పీఎం-వీబీఆర్‌వై గురించి పరిశ్రమల్లోగానీ, ఉపాధి కల్పనా సంస్థల్లోగానీ అవగాహన సదస్సులు లేవు. దీనితో ఇప్పటివరకు దీని గురించి తెలిసింది కొంత మందికే. ఈ పథకాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళితే తప్ప.. లక్ష్యం నెరవేరదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. 305కోట్లకుపైగా ఉద్యోగాలను సృష్టించాలన్న లక్ష్యం నెరవేరదు.

తగ్గుతున్న గోదావరి

మహదేవపూర్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలం కాళేశ్వర త్రివేణి సంగమం వద్ద బుధవారం గోదావరి తగ్గుముఖం పట్టింది. 50 రోజుల నుంచి వరుస వర్షాలతో అల్ల కల్లోలం చేసిన గోదావరి వరద తగ్గుముఖం పడుతుండడంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. అంతేగాకుండా మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రాణహిత నది వరద తగ్గడంతో కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి 9.70 మీటర్ల ఎత్తుతో ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతన్న వరద

మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బుధవారం బ్యారేజీలోకి 7.71లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి అంతేనీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం 8మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.

సౌత్ జోన్ పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్ అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 4 నుంచి 7 వరకు కర్నాటకలోని బెల్గావి రాణి చెన్నమ్మ వర్సిటీలో నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ కాకతీయ యూనివర్సిటీ పురుషుల కబడ్డీ పోటీలకు జట్టు ఎంపికైంది. ఈ మేరకు కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య బుధవారం ఎంపిక క్రీడాకారుల వివరాలను వెల్లడించారు. ఎంపికయిన వారిలో బి.సుమన్ (కేడీసీ, హనుమకొండ), సీహెచ్.శివాజీ (వాగ్దేవి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, బొల్లికుంట), బి.రేవంత్ (వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల, హనుమకొండ), బి.అజాద్ (ఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల, ఖమ్మం), జి.నాగరాజు (కేయూ వ్యాయామ విద్యాకళాశాల), జి.గోపి (యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, ఖమ్మం), జి.రమేశ్ (యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, కేయూ), యూ.శ్రావణ్ (వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల హనుమకొండ), వి.కృష్ణకుమార్ (యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ హనుమకొండ) బి.కౌశిక్ (ఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల, ఖమ్మం), కె.బన్నీ(కేడీసీ, హనుమకొండ), సీహెచ్.రాము (ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జనగామ), పి.సోమేశ్వర్ (యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, కేయూ), పి.ప్రణయ్ (యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, హనుమకొండ)లు ఎంపికైనట్లు వెంకయ్య వెల్లడించారు.

జట్టుకు కోచ్‌గా కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.కుమారస్వామి, మేనేజర్‌గా హనుమకొండ వాగ్దేవి డిగ్రీ కళాశాల పీడీ పి.కిషన్‌లు వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులతో కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ వెంకయ్య, కుమార్ తదితరులు

నేడు మాంసం షాపులు తెరవొద్దు..
5
జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

ఒకరోజు ముందే కొనేశారు..

- మద్యం, మాంసం ప్రియుల ముందు జాగ్రత్త
- షాపుల ముందు జనం బారులు
- దసరా, గాంధీ జయంతి ఒకే రోజు వచ్చిన ఫలితం

హనుమకొండ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది అక్టోబర్ 2న దసరా పండుగ, గాంధీ జయంతి ఒకే రోజు రావడంతో మద్యం, మాంసం ప్రియులు ఇబ్బందుల్లో పడ్డారు. సాధారణంగా గాంధీ జయంతి రోజున మద్యం, మాంసం దుకాణాలను మూసివేయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే దసరా పండుగ కూడా అదే రోజు రావడంతో నిషేధం మందుబాబులకు, మటన్ ప్రియులకు అశనిపాతంలా తగిలింది. దసరా అంటే చుక్క, ముక్క ఉండాల్సిందే. ఈ రెండు లేకపోతే దసరాయే లేదు. కానీ ఈసారి పెద్ద చిక్కొచ్చి పడింది. దసరా, గాంధీ జయంతి ఒకే రోజు రావడం చాలా అరుదుగా జరుగుతుంది. ఈ విచిత్ర పరిస్థితి ఉండడంతో మందుబాబులు, మాంసం ప్రియులు ఒకరోజు ముందే మేల్కొన్నారు. ముందే మద్యం, మాంసం కొనుగోలు చేయడానికి దుకాణాల ముందు పెద్ద ఎత్తున క్యూకట్టారు. అర్ధరాత్రి 12 గంటలు దాటితే నిషేధం అమలులోకి వస్తుందన్న కారణంతో కావలసిన మద్యాన్ని ఎగబడి కొన్నారు. మాంసం విక్రయదారులు కూడా ఒక రోజు ముందే పెద్దఎత్తున మాంసం విక్రయాలను సాగించారు. నగరంలో ఏ మద్యం షాపు ముందు చూసినా క్యూ కనిపించింది. మాంసం దుకాణాలు కూడా కిటకిటలాడాయి.


హనుమకొండలోని ఓ లిక్కర్ మార్టులో మద్యం ప్రియుల రద్దీ

పెరిగిన ధరలు

దసరా పండుగను పురస్కరించుకొని మాంసం ధరలు అమాంతం పెరిగాయి. సాధారణంగా మామూలు రోజుల్లో కిలో మటన్ రూ.900కు అమ్మకమయ్యేది. బుధవారం కిలో రూ.1000, డిమాండ్‌ను బట్టి అంతకన్నా ఎక్కువ ధరకు దుకాణదారులు విక్రయిస్తున్నారు. గాంధీ జయంతివల్ల దసరా రోజు అది కూడా దొరికే పరిస్థితి లేకపోవడంతో మాంసం ప్రియులు ఎంత ధరైనా పెట్టి కొనుగోలు చేస్తున్నారు. మేకలు, గొర్రెల ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. సాధారణ రోజుల్లో వీటి ధరలు సైజ్, బరువును బట్టి రూ.7వేల నుంచి రూ.9వేల మధ్య ఉండేది. కానీ దసరా రోజు ఫ్యాక్టరీలు, వ్యాపార సంస్థలు, అపార్టుమెంట్లు, ఇళ్ల ముందు జంతుబలులు ఇవ్వడం సర్వసాధారణం. దీనితో వీటికి విపరీతమైన డిమాండ్ పెరిగింది. రెండు, మూడు రోజుల ముందే గొర్రెలు, మేకల అమ్మకందారులకు అడ్వాన్సు ఇచ్చి మరీ బుక్ చేసుకున్నారు. ఆలస్యం అయితే అవి దొరికే పరిస్థితి లేదు. డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని వ్యాపారులు వీటి ధరలను అమాంతం పెంచేశారు. మద్యం ధరలు కూడా పెరిగాయి. పేరున్న బ్రాండ్ల మద్యం బాటిళ్లపై రూ.20 నుంచి రూ.40 పెంచి విక్రయిస్తున్నారు. దసరా జోష్‌లో కొనుగోలుదారులు కూడా ఇదేం పట్టించుకోకుండా కొనుగోలు చేస్తున్నారు.


వివరాలు వెల్లడిస్తున్న వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్

అధిక డబ్బుల ఆశచూపి మోసం

చైన్ సిస్టమ్ పేరిట దగా చేస్తున్న ముఠా అరెస్టు

నగదుతోపాటు, బంగారం స్వాధీనం

వివరాలు వెల్లడించిన వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్

5

నేడు భద్రకాళి మహాదర్శనం

చక్రస్నానం, అమ్మవారికి పట్టాభిషేకం

సాయంత్రం జల క్రీడోత్సవం

దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు, వసతుల ఏర్పాటు

5

బాధ్యతలు చేపట్టిన కేయూ విద్యాకళాశాల ప్రిన్సిపాల్

కేయూ క్యాంపస్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కేయూ ఎడ్యుకేషన్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నల్లాని శ్రీనివాస్ బుధవారం ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వ్యవరించిన కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం నుంచి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నల్లాని శ్రీనివాస్‌కు పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్,డీన్ ప్రొఫెసర్ నీలం రాంనాథ్‌కిషన్, ప్రొఫెసర్ కట్ల రాజేందర్, డాక్టర్ కొట్టే భాస్కర్ తదితరులు పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.



రిజిస్ట్రార్ రామచంద్రం నుంచి బాధ్యతలు చేపడుతున్న నల్లాని శ్రీనివాస్

నేడు దసరా ఉత్సవాలు

ఆత్మకూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : వేణుగోపాలస్వామి దేవాలయంలో గురువారం దసరా మహోత్సవాలు, శమీపూజలు నిర్వహిస్తున్నట్లు వేణుగోపాలస్వామి దేవాలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి తెలిపారు. బుధవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయంలో దసరా పర్వదినం సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు, అర్చనలు, సాయంత్రం 4:30 నిమిషాలకు జరుగు తుందన్నారు. స్వామిని పూజించిన అనంతరం శమీపత్రాన్ని స్వీకరించి స్వామి వారిని మనసారా వేడుకుంటే వేణుగోపాల స్వామి అనుగ్రహం లభిస్తుందని అర్చకులు ఆరుట్ల మాదవమూర్తి తెలిపారు. దసరా సందర్భంగా భజన మండలితో ప్రత్యేక భక్తి పాటలు, భజనలు, దీపారాధనలు ఉంటాయన్నారు.

నేడు దామేశ్వరాలయంలో ప్రత్యేక అభిషేకాలు

దామెర, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దామేశ్వర ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు నాగిళ్ల రాజుశర్మ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు అమ్మ వారికి అభిషేకాలు జరుగుతాయని ఆయన వివరించారు. అలాగే జమ్మి పూజ, వాహన పూజల అనంతరం అమ్మవారి కలశ ఉద్వాసన, ఊరేగింపు ఉంటుందని తెలిపారు. కాగా, భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని, అమ్మ వారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

నేడు మాంసం విక్రయిస్తే చర్యలు

పరకాల మునిసిపల్ కమిషనర్ సుష్మ

పరకాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : గాంధీ జయంతి అక్టోబరు 2వ తేదీన గురువారం మాంసం విక్రయాలు జరుపడం నేరమని పరకాల మునిసిపల్ కమిషనర్ కె.సుష్మ తెలిపారు. మటన్, చికెన్ షాపులను మూసి వేయాలని ఆదేశించారు. ఆదేశాలను ఉల్లంఘించినట్లయితే వారిపై మునిసిపల్ చట్టం 2019 ప్రకారం చర్యలతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

'ఎన్నికల్లో ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించాలి'

దామెర, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాబోయే ఎన్నికల్లో ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి సతీష్‌ముదిరాజ్ కోరారు. బుధవారం దామెర మండల కేంద్రంలో బండి సతీష్‌ముదిరాజ్ విలేకరులతో మాట్లాడారు. బీసీ సామాజిక వర్గంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్‌లకు అన్ని రాజకీయ పార్టీలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. అలాగే యువత వివిధ రాజకీయ పార్టీల జెండాలను మోయకుండా రాజకీయ చైతన్యంతో ముందుకు వచ్చి పోటీల్లో నిలబడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు సంకెళ్ల సంపత్, సాదు చంద్రమౌళి, సాదు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలను ఆదుకుంటాం



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రముఖ న్యాయవాది కలకోటి మహేందర్

ఆత్మకూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటామని ప్రముఖ న్యాయవాది అసైన్ ల్యాడ్ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ అన్నారు. బుధవారం ఆత్మకూరు మండలం నాగయ్యపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న ప్రజాసంఘాల జేఏసీ ౘైర్మన్ మదాసి సురేష్ ఆధ్వర్యంలో ప్రముఖ న్యాయవాది కలకోటి మహేందర్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, రూ.4 వేలు ఆర్థిక సహాయం అందజేసి ప్రగాఢసంతాపం తెలియజేశారు. మీ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారితో పాటు రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కుమార్‌గాడ్గే, దళితబహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు చుంచు రాజేందర్ బీఆర్ఎస్ పార్టీ సీని యర్ నాయకుడు నేరేళ్ల బస్వారెడ్డి, మాజీ సర్పంచ్ మదాసి సాంబయ్య, ధర్మసమాజ్ గ్రామకమిటీ అధ్యక్షుడు మదాసి జగన్‌రాజ్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాధారణంగా ఆహ్వానిస్తున్న వొడితల ప్రణవ్‌బాబు

కమలాపూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) స్థానిక సంస్థల ఎన్నికల వేళ హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీలో జోష్ పెరిగింది. కమలాపూర్ మండల పరిధిలోని ఉప్పలపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవ్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రణవ్ బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెడుతున్న పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన కమలాపూర్ మండల నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ప్రణవ్ తనదైన నాయకత్వ లక్షణాలతో పార్టీని, అభివృద్ధిలో సమన్యాయం పాటిస్తూ ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా తిరుపతి



భీమదేవరపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎదులాపురం తిరుపతిని నియమించినట్లు కాం గ్రెస్ నాయకులు కొల్గూరి రాజు, ఆదరి శ్రీనివాస్‌లు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేర కు తిరుపతిని ముల్కనూర్ మేజర్ గ్రామపం చాయతీ అధ్యక్షుడిగా నియమించినట్లు పేర్కొ న్నా రు. తన నియామకానికి సహకరించిన మంత్రి పొ న్నం ప్రభాకర్‌కు కృత జ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



పరకాలలో మహిషాసుర మర్దిని అవతారంలో అమ్మవారు



వీరభద్ర స్వామి ఆలయంలో మహిషాసురమర్దినిగా భద్రకాళి



ల్యాదెల్లలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న పెసరు విజయచందర్‌రెడ్డి

మహిషాసురమర్దిని అవతారంలో అమ్మవారు

పరకాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : పరకాల పట్టణంలోని కనకదుర్గమ్మ, మదన పోచమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 10వ రోజు బుధవారం మహిషాసుర మర్ధిని అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు బండి సారంగపాణి, దేవునూరి మేఘనాథ్, కాచం గురు ప్రసాద్, నాగెల్లి రంజిత్, వీరేశ్‌రావు, శివప్రసాద్, శంతన్‌రెడ్డి, శాలిని శివుడు, శ్రీకాంత్, నిఖిల్, సాయి పాల్గొన్నారు.

● ఆత్మకూరు : విజయాలను అందించే విజయదుర్గాదేవికి భక్తుల విశేషపూజలు, కుంకుమార్చనలు రకరకాల నైవేద్యాలు పెట్టి తనివితీరా మొక్కుకున్నారు. బుధవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని శ్రీదుర్గాదేవి నవరాత్రుల్లో 10వ రోజు విజయదుర్గా దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితులు ఆరుట్ల మాధవమూర్తి పర్యవేక్షణలో విశేషపూజలు నిర్వహించారు. అమ్మవారి అనుగ్రహం ఉంటేనే చేసే ప్రతీ పనిలో విజయం సాధిస్తామని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తనుగుల సందీప్ అన్నారు.

● భీమదేవరపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భద్రకాళి అమ్మవారు మహిషాసురమర్ధిని రూపంలో బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కిషన్‌రావు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● దామెర : మండలంలోని ల్యాదెల్ల గ్రామంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా బుధవారం అర్చకులు శరత్ శర్మ వేద మంత్రాల నడుమ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ౘైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు జరిపించారు. ఆయన మాట్లాడుతూ.. దుర్గామాత అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ పాడి, పంటలు, సుఖ సంతోషాలతో క్షేమంగా ఉండాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా ఛాలెంజ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక పూజల్లో పిట్టల రమేష్, మాదాసు చిరంజీవి, రామంచి చిరంజీవి, మాందాటి శ్రీకాంత్, బత్తుల సుమంత్, డెంగు నవీన్, అన్నబోయిన రోహిత్, జక్కుల శ్రీకాంత్, యూత్ సభ్యులు బండారి నాగరాజు, పిడుగు అనిల్, రమేష్, కన్నెబోయిన రాజ్‌కుమార్, రాజు, నానబోయిన శ్రీనివాస్, బొంకూరి తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర సాంబయ్య ప్రజా జీవితం స్ఫూర్తిదాయకం

ఆత్మకూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : సమాజసేవ కోసం జీవితం అంకితం చేసిన ఎర్ర సాంబయ్య ప్రజా జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని దళితబహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు చుంచు రాజేందర్ అన్నారు. బుధవారం ఆత్మకూరు మండలం నాగయ్యపల్లి గ్రామంలో ఎర్రసాంబయ్య రెండవ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంచు రాజేందర్, ములుగు జిల్లా సాధనసమితి అధ్యక్షుడు ముంజల భిక్షపతిగౌడ్, రజక రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు చాపర్తి కుమార్‌గాడ్గేలు మాల వేసి నివాళుర్పించారు. ఈకార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కలకోటి మహేందర్, జిల్లా ప్రజాసంఘాల జేఏసీ ౘైర్మన్ మదాసి సురేష్, రాజు, కట్టమల్లు, రాధారపు అనిల్, గిన్నారపు రా జు, జినుక సంధ్య, కట్టమ్మ, తదితరులు ఉన్నారు.



ఎర్ర సాంబయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

'తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే ఆస్తిరాదు'

బాలసముద్రం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను పట్టించుకోని వారి పిల్లలకు వారి ఆస్తులను అనుభవించే హక్కు లేదని సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ డాక్టర్ కె.అనితారెడ్డి అన్నారు. అక్టోబరు 1న ప్రపంచ వృద్ధుల దినోత్సవం గురించి ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రుల వృద్ధుల సంరక్షణ, పోషణ చట్టం అండగా నిలుస్తుందని, కన్నవారిని పట్టించుకోని బిడ్డల విషయంలో ట్రిబ్యునల్ సత్వర విచారణ జరుపుతుందని తెలిపారు. అలాంటి వివాదాల్లో తల్లిదండ్రులు తమ పిల్లలకు బదిలీ చేసిన ఆస్తిపై యాజమాన్య హక్కులు తిరిగి బాధితులకే దక్కేలా ఆదేశించే అధికారం ట్రిబ్యునల్ కోర్టుకు ఉందని చెప్పారు. సీనియర్ సిటిజన్స్‌కు ఎలాంటి సమస్యలు వచ్చినా ట్రిబ్యునల్ బెంచ్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

ఉద్యోగుల రక్తదాన శిబిరాలు

బాలసముద్రం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ సిల్వర్ జుబ్లీ వేడుకల సందర్భంగా సంస్థ ఉద్యోగులు అలాగే జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా ఈపీఎఫ్ ఉద్యోగుల భవిష్యనిధి విభాగం ఉద్యోగులు బుధవారం సంయుక్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఈవీ శ్రీనివాసరావు పాల్గొని రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేసి రక్తదానం చేసిన ఉద్యోగులను అభినందించారు. కార్యక్రమంలో ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ వైడీ శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ శివకేష్‌మీనా, బీఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం. కిషన్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతలకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న ఈవీ శ్రీనివాసరావు

సన్నవడ్లకే కాదు.. దొడ్డు వడ్లకూ బోనస్

రైతులకు ముల్కనూర్ బ్యాంకు ప్రోత్సాహం

1983 నుంచి ధాన్యానికి చెల్లింపు

ఇప్పటి వరకు రూ. 45 కోట్లు పంపిణీ

భీమదేవరపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘంలో సభ్యులకు తాము పండించిన వరిధాన్యం మధ్య వర్తులు, దళారుల ప్రమేయంతో రైతులు నష్టపోతున్నారని గ్రహించిన ముల్కనూర్ సహకార బ్యాంకు తానే స్వయంగా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని భావించింది. 1956లో ముల్కనూర్ బ్యాంకు ప్రారంభం కాగా, 1983-84నుంచి వరిధాన్యాన్ని కొనుగోలు చేయడం ప్రారంభించింది. వరిధాన్యంలో సన్నవడ్లకే కాకుండా దొడ్డు వడ్లకు సైతం బోనస్ అందిస్తూ రైతులకు చేయూతగా నిలుస్తుంది.

ముల్కనూర్ బ్యాంకు రైతులు తాము పండించిన వరిధాన్యాన్ని బ్యాంకు వ్యవసాయ అప్పుల కింద కొనుగోలు చేస్తుంది. వ్యవసాయ అప్పుతో పాటు మధ్యకాలిక రుణాల కింద సైతం వరిధాన్యాన్ని కొనుగోలు చేస్తుంది. వరిధాన్యం అమ్మిన తర్వాత అందులో వచ్చిన లాభాలను తిరిగి బోనస్ రూపంలో రైతులకు చెల్లిస్తుంది. తెలంగాణలోని ప్రజలు, రైతులకు సద్దుల బతుకమ్మ, దసరా అతిపెద్ద పండుగా, ఈ సమయంలో రైతులకు పంట చేతికి రాదు. దీంతో ఇబ్బందులకు గురవుతున్నారని రైతులకు బోనస్ రూపంలో అందిస్తుంది.

ఇప్పటి వరకు రూ. 45 కోట్ల బోనస్ పంపిణీ..

ముల్కనూర్ సహకార బ్యాంకు రైతుల నుంచి కొనుగోలు చేసిన వరిధాన్యానికి రూ. 45 కోట్ల వరకు బోనస్ చెల్లించారు. వరి సన్నవరిధాన్యానికి రూ. 200, దొడ్డు రకం వరిధాన్యానికి రూ. 120 క్వింటాల్‌కు అందజేస్తున్నారు. ఈ సంవత్సరం రూ. 3.70 కోట్లు రైతులకు బోనస్ రూపంలో అందజేశారు. 1983 నుంచి ఈ పథకం అమల్లో ఉంది. ప్రభుత్వాని కంటే ముందుగానే దాదాపుగా 40 ఏళ్లగా రైతులకు సన్నవడ్లకే కాకుండా దొడ్డు వడ్లకు బోనస్ అందిస్తుంది. అలాగే పత్తి క్వింటాల్‌కు రూ. 300 బోనస్‌ను అందజేస్తుంది. దీంతో రైతుల కళ్లలో ఆనందం వెల్లువిరిస్తుంది. రైతులు పండించిన పంటలు బ్యాంకు కొనుగోలు చేయడం వల్ల బ్యాంకు వ్యవసాయ రుణాల రికవరీ 99 శాతానికి ఉండడం గమనార్హం.



ముల్కనూర్ బ్యాంకు పరిధిలో బోనస్ తీసుకుంటున్న రైతులు(ఫైల్)

పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నాం..

అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, బ్యాంకు అధ్యక్షుడు, ముల్కనూర్



ముల్కనూర్ బ్యాంకులోని రైతులకు ప్రతి సంవత్సరం బోనస్ అందిస్తున్నాం. రైతులు పండించిన వరిధాన్యాన్ని ముల్కనూర్ బ్యాంకు వారి వ్యవసాయ అప్పుల కింద కొనుగోలు చేస్తున్నాం. దీంతో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నాం. అలాగే వ్యవసాయ అప్పులు కట్టడం వల్ల రైతుల రికవరీ కూడా 99శాతం ఉంటుంది. ప్రతి సంవత్సరం బ్యాంకు పరిధిలోని సభ్యులు ఇబ్బంది పడకుండా సన్నవడ్లు, దొడ్డు వడ్లు, పత్తికి బోనస్ అందజేస్తున్నాం.

బోనస్ అందించడంతో రైతులకు ఆనందం

మంగ రామచంద్రం, రైతు, ముల్కనూర్



సద్దుల బతుకమ్మ, దసరా పండుగకు వ్యవసాయ పంటలు రైతులకు అందవు. దీంతో రైతులు తెలంగాణలోని అతిపెద్ద పండుగ దసరాకు ఇబ్బంది పడుతారు. ఈ విషయాన్ని గమనించిన ముల్కనూర్ బ్యాంకు పాలకవర్గం గత 40 సంవత్సరాలకు దసరా పండుగకు బోనస్ అందజేస్తుంది. దీంతో చిల్లి గవ్వ లేని సమయంలో బోనస్ అందజేయడంతో సద్దుల బతుకమ్మ, దసరా ఘనంగా జరుపుకుంటున్నాం. ఒక్కో రైతుకు బోనస్ రూ. 10నుంచి రూ. 30వేల వరకు వస్తుంది.

వినియోగదారుల సేవే బీఎస్ఎన్ఎల్ లక్ష్యం

బీఎస్ఎన్ఎల్ వరంగల్ డీజీఎం కిషన్

వడ్డెపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు సమగ్ర సేవలు అందించడమే తమ సంస్థ లక్ష్యమని బీఎస్ఎన్ఎల్ వరంగల్ డీజీఎం కిషన్ అన్నారు. వరంగల్ పోతన నగర్‌లోని బీఎస్ఎన్ఎల్ భవన్ నుంచి హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం ప్రాంతంలోని బీఎస్ఎన్ఎల్ భవనం వరకు ఉద్యోగులు బైక్ ర్యాలీ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ సెప్టెంబరు 27న మేక్ ఇన్ ఇండియా - ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్‌లో భాగంగా దేశీయంగా అభివృద్ధి చేసిన 4జీ నెట్ వర్క్‌ను ప్రారంభించారని అన్నారు. బీఎస్ఎన్ఎల్ అధికారులు వసంత్‌కుమార్, హరిసింగ్, శేషు, శ్రీనివాస్, బాలు పాల్గొన్నారు.



హనుమకొండ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

యూత్ ఆధ్వర్యంలో అన్నదానం

గిర్మాజిపేట, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ గిర్మాజిపేట పాత కూరగాయల మార్కెట్‌వీధిలో శ్రీదేవి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అన్నదానం చేశారు. ఇంతేజార్ గంజ్ సీఐ షూక్రూ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

నగరంలో రావణవధకు ఏర్పాట్లు పూర్తి

ఖిలావరంగల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రావణవధ కార్యక్రమంలో భాగంగా బుధవారం శివనగర్, తూర్పుకోటలలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. శివనగర్ సబ్‌స్టేషన్ వద్ద గల బతుకమ్మ ఆటమైదానంతో పాటు ఖిలావరంగల్ రాతికోట సమీపంలో రావణవధ ప్రతిమలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బుధవారం తూర్పుకోటలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు వెల్పుగొండ సువర్ణసురేష్ అధ్యక్షతన సమితీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తూర్పుకోటలో రావణవధ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం విభాగాల వారీగా కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని రావణవధ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు కందిమళ్ల మహేష్, బోయిని దూడయ్య, బేడిద వీరన్న, సంగరబోయిన చందర్, వనపర్తి ధర్మరాజు, గన్నారపు రమేష్, సంగరబోయిన చందర్, సుంచు జగదీశ్వర్, బొలుగొడ్డు శ్రీనివాస్, మేకల కుమార్, పోశాల శ్రీనివాస్, అర్షం రాంబాబు, చింతం రమేష్, బిళ్ళ కిషోర్, పెసరు కుమార్, సుంచు వీరన్న, సిరబోయిన వాసుదేవ్, బండి కృష్ణ, ఏసీ రెడ్డి రమేష్, ఉమేష్, రంజిత్, బిళ్ళ హరేందర్, అల్లం కేశవరాజు, కరుణాకర్, నాంద్రే అమర్‌నాద్, మేకల రమేష్, బేర నరేందర్, శివ, నవీన్, ప్రమోద్, జనార్దన్, ఐలయ్య, ప్రతాప్, కుమార్, కమలాకర్ పాల్గొన్నారు.